4వ పాఠం అక్టోబరు 18-24

# అన్ని సంఘర్షణల వెనుక ఉన్న సంఘర్షణ

## సబ్బాతు మధ్యాహ్నము అక్టోబరు 18

**ఈ వారమునకు చదువ వలసిన వచనములు : యెహోషువ 5:13-15; యెషయా 37:16; ప్రకటన 12:7-9; ద్వితియో 32:17; నిర్గమ 14:13,14; యెహోషువ 6:15-20.**

**కంఠతవచనం: "యెహోవ ఒక నరుని మనవి వినిన ఆ దినమువంటి దినము దానికి ముందే గాని దానికి తరువాతనే గాని యుండలేదు. నాడు యెహోవా ఇశ్రాయేలు పక్షముగా యుద్ధము చేసెను" (యెహోషువ 10:14).**

యెహోషువ గ్రంథము చదివినప్పుడు, దేవుడు ఆజ్ఞాపించగా, ఇశ్రాయేలీయులు జరిపిన సైనిక పోరాటములకు సంబంధించిన ఎన్నో విషయాలను గూర్చి తెలుసుకుంటాము. వారు చేసిన ఆ పోరాటములన్నియు దేవుని నామమున మరియు దేవుని సహాయముతోనే చేసినవి. కానాను దేశమును ఇశ్రాయేలీయులు స్వాధీనము చేసుకొనిన పోరాటముల వెనుక దేవుడున్నాడనే విషయము యెహోషువ గ్రంథమందంతట వ్యాపించి యున్నది. ఆ సమాచారమంతయు ఒక వ్యాఖ్యాత వివరించినట్లు చెప్పబడెను (యెహోషువ 10:10,11). ఆ విధముగా చెప్పబడిన విషయమంతయు దేవుని సొంత మాటలలో చెప్పబడెను (యెహోషువ 6:2; 8:1) యెహోషువ మాట్లాడుచున్నట్లు (యెహోషువ 4:23,24; 8:7) రాహాబు కూడా కొన్ని విషయాలు మాట్లాడగా వ్రాయబడెను. (యెహోషువ 2:10) వేగులవారు మాట్లాడిన విషయాలు కూడా ఉన్నవి. (యెహోషువ 2:24) ప్రజలు కూడా కొన్ని విషయాలు మాట్లాడగా అవి కూడా ఈ గ్రంథములో వ్రాయబడెను (యెహోషువ 24:18) హింసాత్మకమైన ఈ పోరాటములను దేవుడే ఆరంభించినట్లు కనిపించుచున్నవి.

వాస్తవములు ఇట్లుండగ, వాటికి సంబంధించి అనివార్యముగ, పరిస్థితులలో అనేక ప్రశ్నలు ఎదురవుచున్నవి. పాతనిబంధన కాలములలో దేవుని యొక్క ప్రజలు అటువంటి పోరాటములతో కూడిన కార్యములను చేయుటకు వారెట్లు తీర్మానించుకున్నారు లేక అట్టి పోరాట విధానమును ఏవిధముగా ఎన్నుకొనియున్నారు? ప్రేమతత్వము, ప్రేమ స్వభావము కలిగిన దేవుడు 'యుద్ధములు చేసే' దేవుడనే రూపమును కలిగి యుండుట ఏవిధముగా దేవునికి సమర్ధనీయమైనది? ఉదాహరణకు (నిర్గమ 34:6; కీర్తన 86:15; కీర్తన 103:8; కీర్తన 108:4) చదువుడి.

యెహోషువ గ్రంథములోను, ఇతర బైబిలు పుస్తకములలోను పేర్కొనబడిన దేవుని ప్రేరణతో జరిగిన యుద్ధముల విషయమై లేవనెత్తబడిన కొన్ని కష్టమైన ప్రశ్నలకు జవాబులను ఈ వారము లేక రాబోవు వారములలో అన్వేషించబోవుచున్నాము.

– అక్టోబరు 25, సబ్బాతు దినమున ఈ వారమునకు ఏర్పాటు చేయబడిన సబ్బాతుబడి పాఠమును అధ్యయనము చేయుటకు సిద్ధపడుడి.

## ఆదివారం అక్టోబరు 9

### యెహోవా దేవుని సైన్యమునకు సేనాధిపతి

**యెహోషువ 5:13-15 చదువుడి. కానాను యొక్క విజయము వెనుక ఉన్న నేపథ్యమును గూర్చి ఈ వాక్యములు ఏమి చెప్పుచున్నవి?**

.................................................................................................

ఇశ్రాయేలీయులు అప్పుడే యోర్దాను నదిని దాటి శత్రువుల భూభాగములోనికి అడుగుపెట్టారు. ద్వారములు చాలా బలముగా మూసివేయబడియున్న యెరికో కోట ముందుగా వారికి కనిపించింది. (యెహోషువ 6:1) అదే సమయానికి ఆ ప్రాంతములో యుద్ధము సంభవింపబోవుచున్నదనే యుద్ధ వ్యూహమును గూర్చి అక్కడ నివసించుచున్న ప్రజలకు ఏమాత్రము తెలియదు. ఒక సుదీర్ఘకాలము పాటు ఆ పట్టణము శత్రుసైన్యముతో ముట్టడి వేయబడినను ఆ పట్టణములోపల ఉన్న ప్రజలకు ఎటువంటి ఆపద వాటిల్లదు అని ధీమాగా ఉండే ఆ పరిస్థితులలో ఆ పట్టణమును ముట్టడించిన ఇశ్రాయేలు సైన్యము యొద్ద కేవలం ఒడిసెలలు బల్లెములు, ఈటెల మరియు బాణముల వంటి సామాన్యమైన యుద్ధ పరికరములే ఉన్నవి.

యెహోషువ యెరికో ప్రాంతమున ఉన్నపుడు ఆ సమయములో అతడు కన్నులెత్తి చూడగా దూసిన కత్తి చేత పట్టుకొనియున్న అపరిచితుడు కనిపించెను. యెహోషువ అతని యొద్దకు వెళ్ళి నీవు ఎవరి పక్షమున పోరాడువాడవని అడిగినపుడు అపరిచితుని యొద్ద నుండి అస్పష్టమైన జవాబు వచ్చెను. "కాదు లేదు" అనే జవాబు వచ్చెను. ఆ అపరిచితుడు యెహోషువ ఆశించినట్లు ఏ పక్షమున అతడున్నాడో తెల్పుటకు ఇష్టపడలేదు గాని యెహోవా అతని పక్షమున ఉన్నాడా? లేక లేడా అనే విషయాన్ని నిర్ణయించుకొనే అవకాశము యెహోషువకు అక్కడ ఇవ్వబడినట్లు కనిపిస్తుంది.

**యెహోషువ 5:14,15తో 2 రాజులు 6:8-17; నెహెమ్యా 9:6 మరియు యెషయా 37:16ను పోల్చి చదువుడి. యెహోవా దేవుని సైన్యమునకు సేనాధిపతి యనే గుర్తింపును గూర్చి మీరు ఏమి నేర్చుకొనియున్నారు?**

"యెహోవా దేవుని సైన్యమునకు సేనాధిపతి" అని స్పష్టముగా తెలియజేయుట హెబ్రీ బైబిలు కున్న ఒక ప్రత్యేకత. ఆ పదములలో సేనాధిపతి మరియు సైన్యములకు అధిపతి అనే మాటలు ఒక సైన్యము యొక్క నాయకుని గూర్చి వివరిస్తుంది. "హోస్టు" అనే మాట పరిశుద్ధ గ్రంథములో సైన్యములో ఉన్న వివిధ విభాగములకు సైన్యాధిపతి అనే భావమును కలిగియున్నది. అయితే మనుష్యులకు అగోచరమైనటువంటి, కన్నులకు కనిపించని నిజమైన దూతల సైన్యము గూర్చి మాట్లాడుకున్నచో మానవ సైన్యముల పోరాటముకన్నా ఎంతో బలమైన పోరాట లేక సంఘర్షణ కనానీయులతో సంభవించనైయున్నదనే భావమును యెహోషువకు కలుగునట్లు దేవుడు చేసెను. అపరిచితుడైన సేనాధిపతిని గూర్చి అతని గుర్తింపు గూర్చి యెహోషువకు స్పష్టమైన అవగాహన కలిగెను. ఆ విషయాన్ని యెహోషువ ఇచ్చిన జవాబులో మనము కనుగొనవచ్చును. ఆ సైన్యాధిపతి దేవునితో సమానుడని గ్రహించుట వలన యెహోషు సాష్టాంగపడి నమస్కరించుట ద్వారా అతని ఆరాధనను గౌరవమును ఆ అపరిచితునికే చెందునని తెలియజేసెను (యెహోషువ 5:14; ఆదికాం. 17:3,2; 2సమూ. 9:6; 2దినవృత్తా 20:18) యుద్ధమునకు సిద్ధముగా ఉన్న యెహోషువ అక్కడ జరిగే యుద్ధ తంత్రమును స్వీకరించుటకు సిద్ధముగా ఉన్నాడు. సైన్యములకు అధిపతియైన యెహోవా వారు ఎదుర్కొనబోవు ఆ గొప్ప సంఘర్షణలో ఆయనే స్వయముగా పాల్గొనబోవుచున్నాడనే సత్యమును యెహోషువ గ్రహించెను.

**తన ప్రజల పక్షమున 'యెహోవా దేవుని సైన్యమునకు' 'సేనాధిపతి' వారిని సంరక్షించుటకు స్వయముగా ఆయనే పనిచేయుచున్నాడనే విషయాన్ని తెలుసుకొనుట ద్వారా**

మనము ఎటువంటి ఆదరణ పొందగలము?

సోమవారం                                                                 అక్టోబరు 20

## పరలోకములో యుద్ధము

**ఇశ్రాయేలీయులు చేయబోయే యుద్ధము, నిజముగా దానికన్నా ముందుగానే దేవుడే పాల్గొనిన చాలా తీవ్రమైన పెద్ద సంఘర్షణ జరిగియుండగా దానియొక్క కొనసాగింపులో భాగముగా వారు చేయనైయున్న యుద్ధము జరుగుచున్నదని యెహోషువ అర్థము చేసుకున్నాడు. దేవుడే స్వయముగా పాల్గొనిన యుద్ధమును గూర్చి మీకు తెలిసినది ఏమిటి? ప్రకటన 12:7-9; యెషయా 14:12-14; యెహెజ్కేలు 28:11-19; దానియేలు 10:12-14 చదువుడి.**

.................................................................................................................

దేవుడు ఈ విశ్వమును బాధ్యతగల మనుష్యులతో విస్తరింపచేయాలనే ఉద్దేశముతో ప్రేమించుటకు సామర్థ్యము కలిగియుండుటకు ముందుగా కావలసిన స్వేచ్ఛా నిర్ణయాధికారముతో వారిని సృష్టించెను. వారు దేవుని చిత్తమునకు అనుకూలముగా గాని లేక వ్యతిరేకముగా గాని నిర్ణయము తీసుకొని జీవించే స్వేచ్ఛ వారికి అనుగ్రహించెను. దూతల సమూహములో చాలా శక్తిమంతుడైన లూసీఫర్ అనే దూత దేవునికి వ్యతిరేకముగా తిరుగుబాటు చేసి అతని పక్షమునకు గొప్ప సంఖ్యలో దూతలను త్రిప్పుకొనెను.

యెషయా 14 మరియు యెహెజ్కేలు 28లో పేర్కొనబడిన ఆ తిరుగుబాటు కొందరు బైబిలు వ్యాఖ్యానకర్తలు ఆ అధ్యాయములో పేర్కొనబడిన ఆ తిరుగుబాటు పరలోకములో సంభవించినది కాదు గాని, అది బబులోను మరియు తూరు దేశపు రాజులు ఎదుర్కొనిన యుద్ధములు అని కొట్టిపారవేయుచున్నారు. అయితే ఆ విధమైనటువంటి బైబిలు వ్యాఖ్యానము సరియైనది కాదు అని తెల్పుటకు సర్వశ్రేష్టమైన సత్యమును ఆధారములతో నిరూపించుటకు అవసరమైన సూచనలు బైబిలులో ఉన్నవి. బబులోను రాజు పరలోకములో దేవుని సింహాసనము చెంత వున్నట్లు (యెషయా 14:12,13) మరియు తూరు రాజు దేవుని పరిశుద్ధ పర్వతము మీద సంరక్షించే ఒక కెరూబువలె ఏదెనులో నివాసమున్నట్లు (యెహెజ్కేలు 28:12-15) వ్యాఖ్యానకర్తలు చెప్పుచున్నారు. బబులోను మరియు తూరు రాజుల విషయములో ఇదేది కూడా నిజము కాదు.

ఆ చారిత్రాత్మక సంఘటన ఆనాటి కాలమునకు చెందినదే అనే అర్థము దానికి లేదని యెషయా ఒక ఉపమాన రీతిలో (హెబ్రీ పదము మషల్) వివరించెను. ఈ ఉదాహరణలో బబులోను రాజు ఒక తిరుగుబాటుకు స్వయం సమృద్ధికి అతడు చూపిన గర్వమునకు నమూనా గాను చూపబడెను. అదేవిధముగా తూరు కుమారుని గూర్చి కూడా యెహెజ్కేలు ఆ వ్యత్యాసమును చూపించెను (యెహెజ్కేలు 28:2) మరియు తూరు రాజును గురించి కూడా (యెహెజ్కేలు 28:11,12) అనగా రాజకుమారుడుగా భూసంబంధమైన విషయాలలో హెచ్చించుకున్నాడు. ఒక రాజుగా అతడు నియమింపబడినపుడు పరలోకములో గర్వముగా ప్రవర్తించినట్లు ఒక సాదృశ్యముగా చూపబడెను.

దానియేలు 10:12-14 ప్రకారము పరలోకములో తిరుగుబాటు చేసిన జీవులు భూమి మీద జరగవలసిన దేవుని లక్ష్యములు నెరవేరకుండా అడ్డుకుంటారు. ఈ సందర్భముగా పరలోకమునకును భూమికిని మధ్య దేవుని నియమము చొప్పున జరిగిన ఇశ్రాయేలు యొక్క యుద్ధములను గూర్చి అర్థము చేసుకోవాలి. మంచి మరియు చెడుకు సంబంధించిన దేవునికి

సాతానుకు మధ్య పరలోకములో జరిగిన మహా సంఘర్షణ, ఇశ్రాయేలు యొక్క పోరాటముల రూపములో భూమి మీద జరుగునట్లు ఉదాహరణముగా పేర్కొనబడినవని గ్రహించవలెను. ఇదంతయు పతనమైన ఈ లోకములో చివరిగా దేవుని యొక్క న్యాయము ఆయన ప్రేమ తిరిగి స్థాపించబడును అనే లక్ష్యమును అర్ధము చేసుకోవాలి.

**మంచి చెడుకు మధ్య సంభవించిన విశ్వ సంఘర్షణను మన సొంత జీవితములోను, ఇతరుల జీవితాలలోను ఏవిధంగా చూడగలుగుచున్నాము?**

## మంగళవారం అక్టోబరు 21

## యెహోవా దేవుడు ఒక యుద్ధ శూరుడు

**నిర్గమ 2:23-25; నిర్గమ 12:12,13 మరియు నిర్గమ 15:3-11 చదువుడి. దేవుడు ఒక యుద్ధ శూరుడు అనగా అర్ధమేమిటి?**

.....................................................................................................

ఐగుప్తు దేశములో చాలా కాలము జీవించిన తరువాత ఇశ్రాయేలీయులు వారి పితరులు సేవించిన నిజదేవుని మరచిపోయిరి. ఐగుప్తు నుండి విమోచింపబడిన తరువాత, అరణ్యములో వారు సాగించిన ప్రయాణములన్నింటిలోను అబ్రహాము, ఇస్సాకు మరియు యాకోబుల యొక్క నిజ దేవుని గూర్చిన జ్ఞానము క్రమేణ లోపించినది. వారు విగ్రహారాధనకు సంబంధించిన కొన్ని ఆచారములను, వారి మతాచారములతో మిళితము చేసి అబద్ధ ఆరాధనను అలవర్చుకున్నారు. (నిర్గమ 32:1-4తో పోల్చి చూడుడి) ఐగుప్తీయుల యొక్క హింసమార్గములను అనుసరించి ఇశ్రాయేలీయులను అణగద్రొక్కుటవలన ఇశ్రాయేలు ప్రజలు యెహోవా దేవునికి మొఱ్ఱపెట్టుకొనిరి (నిర్గమ 2:23-25) సరియైన సమయములో వారి పక్షమున యెహోవా దేవుడు జోక్యము చేసుకొనెను.

అయితే నిర్గమ కాండములోని మొదటి 12 అధ్యాయములలో పేర్కొనబడిన సంఘర్షణ కేవలము మోషేకు మరియు ఫరోకును మధ్య సంభవించినది మాత్రమే కాదు. పురాతన సమీప తూర్పుదేశములలోని యుద్ధ సిద్ధాంతము ప్రజల మధ్యన పోరాటములు, సంఘర్షణలు మొదలగునవి వివిధ తెగలకు చెందిన ప్రజలు ఆరాధించేవారి ఇష్ట దేవతల మధ్య జరిగే పోరాటములుగా పరిగణింపబడేవి. నిర్గమ 12:12లో యెహోవా దేవుడు ఈలాగు సెలవిచ్చెను. ఈ రాత్రి నేను ఐగుప్తు దేశమును సంచరించి, తొలి సంతతియంతటిని హతము చేసి ఐగుప్తు దేవతల కందరికిని తీర్పు తీర్చెదను. ఆవిధముగా యెహోవా దేవుడు కేవలం ఫరో మీదనే కాకుండా ఐగుప్తు సమాజములో ఏర్పడిన అవినీతి, బలహీనులను బానిసలను అణగద్రొక్కడమనే కార్యముల వెనుక ఉన్న దుష్ట శక్తులపై యెహోవా దేవుడు గొప్ప తీర్పు తీర్చెను (లేవీ 17:7; ద్వితియో 32:17).

చివరికి దేవుడు పాపముతో యుద్ధము చేయుచున్నాడు, మరియు ఈ సంఘర్షణ, వాతావరణమును ఆయన శాశ్వతముగా సహించువాడు కాడు (కీర్తన 24:8; ప్రకటన 19:11, 20:1-4,14) పాపములో పతనమైపోయిన దేవదూతలు, మానవులు బాగుపరచ శక్యము గాని రీతులలో పాపముతో కలిసిపోయి పాపులుగా గుర్తింపు పొందినవారు. వారందరు తప్పక నాశనము చేయబడుదురు. పాపము యొక్క తీరును బట్టి చూచినపుడు ఆయా దేశాలలో మానవులకు వ్యతిరేకముగా సంభవించు యుద్ధాలు, విశాల దృక్పథముతో జరుగుచున్న మహా సంఘర్షణలో భాగముగా కొంచెము ముందుగానే తక్కువ నష్టముతో సంభవించుచున్న వనుటకు ఆ పోరాటములన్నింటికి ఒక తుది తీర్పు సమాధానమిస్తుంది. అప్పుడు దేవుని యొక్క న్యాయము

స్థిరపర్చబడును. దేవుని యొక్క ప్రేమ స్వభావము బయలుపర్చబడుతుంది.

విశ్వములో దుర్మార్గము పెరిగిపోవుట వలన దేవుడు విశ్వ సంఘర్షణ రూపములో కలుగజేసుకొని దుర్మార్గమును ప్రోత్సహించుచున్న వారిని పూర్తిగా నాశనము చేయబోవుచున్నాడనే గుణపాఠమును నేర్పుటకు దేవుడే కనానీయులను నాశనం చేసెనని బైబిలు ఆధారముగా తెలుసుకొనగలుగుచున్నాము. చివరికి దేవుడు సత్యవంతుడు కాకమానడు. (రోమా 3:4; ప్రకటన 15:3).

మానవుల ఉనికిలోనికి పాపము ప్రవేశించినది కాబట్టి ఎవరు కూడా మధ్యస్తముగా నిలువబడుటకు అవకాశము లేదు. ఒకడు దేవుని పక్షమునైనా ఉండాలి, లేక పాపము పక్షముననైనా ఉండాలి. అందునుబట్టి కనానీయులను పూర్తిగా తుడిచిపెట్టి వేయడమంటే, కడవరి తీర్పు తరువాత పాపులు మరియు పాపము ఆ విధముగానే తుడిచివేయబడును అనే పాఠమును నేర్చుకొనుటకు ముందుగా కనాను మీద శిక్ష వేయబడెను.

**వాస్తవముగా మహా సంఘర్షణకు రెండువైపులున్నవి. మీరు ఏ పక్షమున ఉన్నారు? నిజముగా మీకెట్లు తెలియును?**

## బుధవారం — అక్టోబరు 22

# నీ కొరకు దేవుడు యుద్ధము చేయును

**నిర్గమ 14:13,14,25 ప్రకారము ఇశ్రాయేలీయులు యుద్ధాలలో పాల్గొనడమునకు సంబంధించి దేవుని యొక్క ప్రాథమిక మరియు ఆదర్శవంతమైన ప్రణాళిక ఏమిటి?**

..................................................................................................

సంక్షోభ సమయములో ఇశ్రాయేలీయులు ఒక భౌతికమైన కఠిన పరిస్థితులను ఎదుర్కొనవలసి వచ్చినపుడు మోషే తన ప్రజలనుద్దేశించి ఈలాగు చెప్పెను:

“అందుకు మోషే భయపడకుడి. యెహోవా మీకు నేడు కలుగజేయు రక్షణను మీరు ఊరక నిలుచుండి చూడుడి. మీరు నేడు చూచిన ఐగుప్తీయులను ఇక మీదట మరి ఎన్నడును చూడరు. యెహోవా మీ పక్షమున యుద్ధము చేయును. మీరు ఊరకయే యుండవలెనని ప్రజలతో చెప్పెను” (నిర్గమ 14:13,14).

బైబిలు వివరణ ప్రకారము, చివరికి ఐగుప్తీయులు కూడా సత్యమును గ్రహించివారంతట వారే ఈలాగు చెప్పుకొనిరి. ‘వారి రథ చక్రములు ఊడి పడునట్లు చేయగా వారు బహు కష్టపడి తోలుచుండిరి. అప్పుడు ఐగుప్తీయులు ఇశ్రాయేలీయుల యెదుట నుండి పారిపోదము రండి; యెహోవా వారి పక్షమున మనతో యుద్ధము చేయుచున్నాడని చెప్పుకొనిరి” (నిర్గమ 14:25).

నిస్సహాయులైన ఇశ్రాయేలీయుల కొరకు ఆశ్చర్యకరముగా దేవుడు వారి పక్షమున తగిన సమయమందు కలుగజేసుకొనెను. ఆ పరిస్థితులలో ఇశ్రాయేలీయులు యుద్ధ నైపుణ్యతల విషయములో శిక్షణ లేనటువంటివారు. అయితే ఇప్పుడు వారు యుద్ధము చేయగలిగిన నమూనా ప్రజలుగా ఏర్పడినారు. ఇశ్రాయేలు పక్షమున దేవుడు వారి వ్యవహారములలోను ఆపత్కాలములో కలుగజేసుకొనుట వలన ఆ మహా నిర్గమము ఒక మాదిరిగాను భావి తరములకు నిలువబడెను. ఇక్కడ యావెహ్ యెహోవా దేవుడు యుద్ధము చేయుటయేగాక, ఇశ్రాయేలీయులు పోరాటము చేయనవసరము లేకుండా పోయెను (నిర్గమ 14:14). దేవుడే యుద్ధము చేయు యుద్ధ శూరుడు. ప్రథమ ప్రయత్నము కూడా ఆయనదే. యుద్ధమునకు అవసరమైన వ్యూహరచనను చేయువాడు ఆయనే. అవసరమైన వనరులతో సమకూర్చుకుంటాడు.

దాడి మొదలు పెట్టి యుద్ధమును నడిపించును. యావెహ్ గనుక (యెహోవా దేవుడు). ఇశ్రాయేలు కొరకు యుద్ధము చేయనిచో వారు విజయమును సాధించలేరు.

ఈ అంశమును గూర్చి ఎలెన్ జి వైట్ వివరణ ఇస్తూ వాస్తవానికి దేవుని యొక్క ప్రణాళిక ప్రకారము ఇశ్రాయేలీయులు యుద్ధము చేసి ఆ వాగ్దాన దేశమును స్వాధీనపరచుకొన వలెననెడిది కాదు గాని వారు ఆయనకు పూర్తిగా లోబడియుండి, ఆయన ఆజ్ఞలకు విధేయతను చూపించుట ద్వారా ఆ దేశమును స్వతంత్రించుకొనవలసి యున్నారు – ఎలెన్ జి వైట్, సైన్సు ఆఫ్ ది టైమ్సు, సెప్టెంబరు 2, 1880.

"ఐగుప్తునుండి వారికి కలిగిన విమోచనములో దేవుడు పోరాడినట్లే కానాను దేశమును స్వాధీనపరచుకొనే విషయములో కూడా ఇశ్రాయేలీయుల యుద్ధములు వారి పక్షమున దేవుడే చేసెను. దేవుడు తన బలముగల హస్తముతో యుద్ధములో కలుగజేసుకొనుచుండగా, ఇశ్రాయేలీయులు కేవలము అక్కడ సాక్షులుగా ఊరకనిలుచుండి చూడవలెను"

దేవునియందు ఇశ్రాయేలీయులకు సరిపడునంత నమ్మకము, విశ్వాసము, ఉన్న యెడల వారు యుద్ధము చేయవలసిన అవసరమే వారికి లేదు అని చరిత్ర రుజువు చేయుచున్నది (2రాజులు 19:2; 2 దినవృత్తా 32; యెషయా 37 చూడుడి).

దేవుని యొక్క ఆదర్శవంతమైన ప్రణాళికలో ఇశ్రాయేలీయులు వారి కొరకు వారు యుద్ధము చేయనవసరము ఎన్నడులేదు. మహా నిర్గమము తరువాత వారు కనుపరచిన అపనమ్మకమునకు పర్యవసానముగా వారు కూడా కనానీయులతో యుద్ధములో పాల్గొనవలసిన అవసరమును దేవుడు అనుమతించెను. మహా నిర్గమము సమయములో ఐగుప్తీయులకు వ్యతిరేకముగా ఇశ్రాయేలీయులు ఒక్క ఖడ్గమును కూడా పైకెత్తవలసిన అవసరము రాలేదో అదే రీతిగా కనానీయులపై విజయము సాధించుటకు వారితో యుద్ధము చేయవలసిన అవసరము లేకపోయి యుండెడిది. (ద్వితియో 7:17-19).

**"ఇశ్రాయేలు జనాంగము దేవునికి వ్యతిరేకముగా సణుగుకొని యుండనిచో వారితో యుద్ధము చేయుటకు వారి శత్రువులను మేల్కొలిపేవాడు కాదు" ఎలెన్ జి వైట్, విమోచన వృత్తాంతము పుట 134. నేడు మన జీవితాలపై సణుగుట ఎటువంటి ప్రభావమును చూపిస్తున్నవి?**

## గురువారం అక్టోబరు 23

## రెండవ మంచి నిర్ణయము

**నిర్గమ 17:7-13 మరియు యెహోషువ 6:15-20 చదువుడి. ఈ రెండు యుద్ధ వివరముల మధ్య ఉన్న పోలికలు ఏమిటి? వాని మధ్య ఉన్న తేడాలు ఏమిటి?**

..............................................................................................

మహా నిర్గమము తరువాత మొట్టమొదటిసారి ఇశ్రాయేలీయులు చేసిన యుద్ధమును గూర్చి నిర్గమ 17లో వ్రాయబడెను. ఆ సమయములో అమాలేకీయులు వచ్చి ఇశ్రాయేలీయులతో యుద్ధము చేయగా, వారిపై ఇశ్రాయేలీయులు విజయము సాధించారు. అంతకు పూర్వము దేవుడు తన అద్వితీయమైన శక్తితో ఐగుప్తీయులను గాయపరచి ఇశ్రాయేలీయులను స్వతంత్రులనుగా నడిపించిన సంఘటనకు వారే సాక్షులు. ఇశ్రాయేలీయులు ఇతర ప్రజలతో యుద్ధములు చేయవలసి యున్నదనే ప్రాథమిక ప్రణాళిక దేవునిది కాదు. (నిర్గమ 23:28; నిర్గమ 33:2) అయితే ఐగుప్తు నుండి ఇశ్రాయేలీయులు విమోచింపబడిన కొద్దికాలమునకే వారు ప్రయాణించుచున్న మార్గమధ్యమున సణుగుట

ప్రారంభించారు (నిర్గమ 17:3) వారి మధ్యన దేవుని సన్నిధి ఉన్నదా లేక లేదా అని కూడా వారు ప్రశ్నించారు. సరిగ్గా ఇదే సమయములో అమాలేకీయుల రాజైన అమాలెకు ఇశ్రాయేలీయులతో యుద్ధము చేయుటకు వచ్చెను. అదేదో ఆకస్మికముగా జరిగిన దాడి కాదు. ఇశ్రాయేలీయులు దేవునియందు మరొకసారి నమ్మకము పెట్టుకొనుటకు నేర్చుకొనులాగున దేవుడే అమాలేకీయులను ఇశ్రాయేలీయుల మీద దాడి చేయుటకు అనుమతించెను.

దేవుని యొక్క నియమములను అనుసరించే విషయములో ఎటువంటి రాజీ పడకుండగానే, తన ప్రజల యొక్క స్థాయికి దిగి వచ్చి ఆయన వారికొరకు నియమించిన ఆదర్శ ప్రణాళికకు తిరిగి రమ్మని నిరంతరము దేవుడు వారిని కోరుచున్నాడు. వారు గనుక ఆయన మాటను ఆలకించియున్న యెడల వారి యుద్ధమునకు వెళ్ళవలసిన అవసరములేకుండా దేవుడే వారి పక్షమున కలుగజేసుకొనుననే విషయాన్ని వారికి గుర్తు చేస్తున్నాడు. నిజానికి యుద్ధమునకు సంబంధించిన వ్యూహరచన (ద్వితియో 20) అరణ్యములో 40 సంవత్సరములు వారి ప్రయాణము సాగించిన అనుభవము తరువాత వారికి ఇవ్వబడెను. అది కూడా ఇశ్రాయేలీయులు కనుపర్చిన అపనమ్మకమును బట్టి దేవుడు ఆవిధముగా చేయవలసి వచ్చెను. నూతన పరిస్థితులు, నూతన యుద్ధ రచనలకు దారి చూపినవి. దీని తరువాతే కనానీయులను సమూలముగా నాశనము చేయవలెనని దేవుడు వారికి సూచించెను (ద్వితియో 20:16-18).

ఇప్పుడు ఇశ్రాయేలీయులకు యుద్ధము చేయుట అవసరమైయున్నందున వారు యావెహ్‌కు అనగా యెహోవ దేవునికి వారి రాజ భక్తిని నిరూపించుకొనవలసిన అవసరము వచ్చెను. దేవుడు ఇశ్రాయేలీయులను విడిచి పెట్టలేదు గాని సంపూర్ణముగా వారు దేవుని శక్తి మీద ఆధారపడి ఆ అనుభవములో దేవుని కార్యములకు సాక్షులుగా పిలువబడిరి.

యెహోషువా గ్రంథము యొక్క చివరి భాగములో ముగింపు మాటలుగా, ఇశ్రాయేలు యొక్క విజయమును గూర్చి యెహోషువ మాట్లాడుటను బట్టి ఆ విజయములో వారు పాల్గొనియున్నారని ధృవీకరించవచ్చును. ఇక్కడ కనానీయులు ఇశ్రాయేలుతో యుద్ధము చేయుచున్నట్లు వ్రాయబడెను. (యెహోషువ 24:11) దైవ సంబంధమైన అద్భుత కార్యము ద్వారా యెరికో పట్టణపు గోడలు కూల్చివేయబడినను ఆ యుద్ధములో ఇశ్రాయేలీయులు చురుకుగా పాల్గొని కానాను ప్రజలు ఎంతో పట్టుదలతో ఇశ్రాయేలీయులకు లొంగిపోకుండా పోరాడుచుండగా, ఆశ్చర్యకరముగా వారికి అపజయము ఎదురయ్యెను.

యెహోవా దేవుని సహాయముపై ఎటువంటి షరతులు లేకుండా నమ్మిన తరువాతే ఇశ్రాయేలీయులు యుద్ధములో పాల్గొన్నారు. అయితే వారు కనుపరచవలసిన నమ్మకము విషయమై పదేపదే వారికి గుర్తు చేయవలసి వచ్చెను. (యెహోషువ 7:12,13; 10:8) ప్రతి యుద్ధము యొక్క ఫలితము చివరికి దేవుని చేతులలో ఉన్నదని వారు గ్రహించాలి. అట్టి తీర్మానము ఇశ్రాలీయులు వారంతట వారు తీసుకొనవలెను.

## శుక్రవారం అక్టోబరు 24

## అదనపు అధ్యయనము

ఎలెన్ జి వైట్, పితరులు మరియు ప్రవక్తలులోని "యెరికో యొక్క పతనము" పుటలు 487-493 చదువుడి.

దేవుని యొక్క అధికారమునకు వ్యతిరేకముగా విశ్వములో తిరుగుబాటు లేచిన తరువాత, దేవుడు ఏమైయున్నాడో అనగా ఆయన మార్పులేనివాడు, శాశ్వతమైనవాడు అనే ఆయన లక్షణాలు ఆయనే అంతము చేసుకొని విశ్వమంతటి మీద ఉన్న తన నాయకత్వమును తిరుగుబాటు చేసిన జీవులకు అప్పగించవలసియున్నది. లేక దేవుడు పరిశుద్ధుడు, నీతిమంతుడు, ప్రేమామయుడు మరియు కృపా మయుడు మరియు ఉనికిలో ఉన్న సమస్తమునకు తండ్రియైయున్నాడు గనుక వాటినైనను ఆయన కలిగియుండవలెను. ఇక్కడ పేర్కొనబడిన రెండు తరహా ఆలోచనలలో రెండవ ఆలోచనను దేవుడు అంగీకరించినట్లు బైబిలు వివరించుచున్నది. అందుచేత ఆయన శక్తికిని మరియు దుర్మార్గపు శక్తులకును మధ్య మహా సంఘర్షణ అనివార్యమైనది.

రాజకీయపరమైన లేక సాంఘిక చారిత్రకపరమైన శక్తులు తిరుగుబాటు అరాజక విశ్వశక్తులు అన్నీ కలిసి యావెహ్‌కి అనగా యెహోవా దేవునికి వ్యతిరేకముగా తిరుగుబాటు చేసి, దేవుని శక్తికి తిరస్కార ధోరణిలో వ్యతిరేకతను చూపించినపుడు యెహోవా దేవుడు విశ్వమంతటిపై రాజ్యాధికారము గల దేవుడుగా ఆ పరిస్థితులకు జవాబు చెప్పుటకు కలుగజేసుకొనెను. ఆవిధముగా మంచి చెడులకు మధ్య ఆరంభమైన విశ్వసంఘర్షణకు అంతిమముగా దేవుడు ఒక యుద్ధ శూరుడుగా కనబడబోవుచున్నాడు. (ప్రకటన 20:8-10) మరియు దైవసంబంధమైన ఇశ్రాయేలీయుల యొక్క యుద్ధములు, విశ్వసంబంధమైన యుద్ధముల యొక్క తక్షణ దర్శనము ఒక అద్దములో చూచినట్లు ఇశ్రాయేలీయులు చేసిన యుద్ధములున్నవి. ఆ సంఘర్షణకు ముగింపుగా, దేవుని యొక్క అంత్యకాల తీర్పు వెలువడును.

ఇశ్రాయేలీయులు వారికి దేవుడనుగ్రహించిన ఆధిక్యతకు గాను వారు నిర్వహించవలసిన బాధ్యతగాను "కానాను దేశములో ప్రవేశించే అవకాశమును వారికి దేవుని సమయము ప్రకారము అనుగ్రహించబడెను గాని, వారి ఉద్దేశపూర్వకముగానే వారి ప్రయత్నములను విరమించుట ద్వారా ఆ వాగ్దాన భూమిని స్వతంత్రించుకొనే అవకాశము తిరస్కరించబడినది. యుద్ధము ద్వారా ఇశ్రాయేలీయులు వారికి వాగ్దానము చేయబడిన దేశమును స్వతంత్రించుకొనుట అనునది దేవుని యొక్క ప్రణాళిక కాదు గాని, దేవుని ఆజ్ఞలకు పరిపూర్ణమైన విధేయతను చూపుట ద్వారా ఆ వాగ్దాన దేశమును పొందు కొనవలసియున్నది" -ఎలెన్ జి వైట్, పితరులు మరియు ప్రవక్తలు, పుట 392.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. విశ్వ సంఘర్షణ నేపథ్యములో ఇశ్రాయేలీయులకు యుద్ధమునకు వెళ్ళుట అని యెహోవా దేవుడు ఆజ్ఞాపించుట ఏవిధంగా అర్ధము చేసుకొనగలం?
2. మీ తరగతిలో సోమవారం పాఠములోని మహా సంఘర్షణను గూర్చి చర్చించండి. ఈ విశ్వసంఘర్షణలో మీ పాత్ర ఏమిటి? దానిని నెరవేర్చుటకు నీవేమి చేయుదువు?
3. నిబ్బరముగా నిలువబడి దేవుడు మన పక్షమున మన ఆధ్యాత్మిక పోరాటములను చేయును అనే విషయాన్ని మన జీవితాలకు ఏవిధముగా అన్వయించుకొనగలము?
4. అనేక సందర్భాలలో చర్చలయందు మన ప్రాంతీయ క్రైస్తవ సంఘాలలో విబేధములు తలెత్తవచ్చును. యెహోషువా 5:13-15 ప్రకారము మన వైఖరిని ఏవిధముగా మార్చు కొనగలము?

❋✶❋